క్లుప్తంగా

డిగ్రీ కళాశాలకు ఫ్యాన్ల అందజేత



విద్యార్థులకు ఫ్యాన్లు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆ కళాశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఎల్ వెంకటేశ్వరరావు ఫ్యాన్లను బహూకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు హేలాపురి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకటరావు, ఎం విజయ కుమార్, ఎస్ పరమేశ, ఎం రాంబాబు, ఎం కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా నాగ సురేష్



నాగ సురేష్

ఏలూరు (టూటౌన్): బీజేపీ యువమోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా అదపాక నాగ సురేష్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ బుధవారం తనకు నియామక పత్రం అందజేశారని నాగ సురేష్ పేర్కొన్నారు. బీజేపీ యువ మోర్చా బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ కృష్ణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

వరిలో మానిపండు తెగులు

పెదవేగి : వరిని మానిపండు తెగులు ఆశిస్తోందని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త రామబద్రిరాజు సూచించారు. బుధవారం పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి ఎం ప్రియాంక ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానిపండు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ ఫణికుమార్ మాట్లాడుతూ వరిలో వచ్చే పొడ తెగులు నివారణకు హెక్సాకొనాజోల్ 2ఎంఎల్ నీటిలో కలిపి, దోమల నివారణకు ఫెక్సలోన్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. సందర్శించి, ఇంగువ, పుల్లటి మజ్జిగ, కోడిగుడ్డు కషాయం, ఘనజీవామృతం, అగ్నిహస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలతో సాగు చేస్తోన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చందు సత్తిబాబు వరి పొలాన్ని సందర్శించారు.

నైపుణ్యం కోసం రండి.. ఉద్యోగంతో వెళ్లండి

- ఏలూరులో స్కిల్ యూనివర్సిటీ, కాలేజీ, హబ్‌లు
- నెలకు ఒక జాబ్ మేళాతో ఉద్యోగ కల్పన



ఏలూరులో సిద్ధమవుతున్న స్కిల్‌సెంటర్



స్కిల్ సెంటర్‌లో తరగతి గది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చదువుకున్న వారికై నా, చదువుకోని వారికై నా, పాసైనా, ఫెయిలైనా ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించడాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతగా తీసుకున్నారు. ఏలూరు నగర, గ్రామీణ ప్రాంతాల యువతీ యువకులకు వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో నైపుణ్యం సాధించే వరకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగాలు వచ్చే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ యూనివర్శిటీ, స్కిల్ కాలేజ్, స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేస్తోంది. వాటిలో కొన్ని ఇప్పటికే అందుబాటులోకి రాగా మరికొన్ని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ప్రధానంగా సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రూ.70 లక్షల బడ్జెట్‌తో ఏర్పాటుచేసిన స్కిల్ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. సుమారుగా రూ.2 కోట్ల బడ్జెట్‌తో స్కిల్ యూనివర్శిటీని సైతం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోనే ఏర్పాటు చేయనున్నారు. దీనికి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నిరుద్యోగులకు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏలూరులో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ గతేడాది నుంచి పని ప్రారంభించింది.

కోర్సులివీ

ఈ స్కిల్ హబ్‌ల్లో డొమాస్టిక్ ఎలక్ట్రికల్ సొల్యూషన్స్, ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్స్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫేరల్స్, సీఆర్ఎం డొమాస్టిక్ నాన్ - వాయిస్, డొమాస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లంబింగ్ జనరల్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, వెబ్ డెవలపర్ వంటి కోర్సుల్లో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఆయా కోర్సుల్లో సుమారు మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తారు.

ఆరు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి

ఏలూరులో స్కిల్ హబ్ ద్వారా గతేడాది నుంచి ఇప్పటి వరకు ఆరు బ్యాచ్‌లకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. ప్రతి కోర్సులో దాదాపు మూడు నెలల పాటు ఇచ్చిన శిక్షణ సత్ఫలితాలు ఇచ్చింది. ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ కోర్సులో 30 మందికి, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో 30 మందికి, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 1 కోర్సులో 20 మందికి, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్-2 కోర్సులో మరో 20 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ కోర్సులతో పాటు జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ హోమ్ అప్లయన్సెస్ కోర్సులో 14 మందికి, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్-3 కోర్సులో మరో 30 మందికి శిక్షణ ఇచ్చారు. ఆయా కోర్సుల్లో శిక్షణ పొందిన వారిలో సుమారు 50 మందికి వివిధ ఉగ్యోగావకాశాలు కల్పించి వారి కుటుంబ ఉపాధికి మార్గం చూపారు.

ఫెయిలైన విద్యార్థులే లక్ష్యం



చదువులో రాణించలేకపోయినా వారిలో వివిధ అంశాల్లో మంచి నైపుణ్యం ఉంటుందని గ్రహించి, వారి అభిరుచి మేరకు ఆయా కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వివిధ స్థాయిల్లో చదివి ఉత్తీర్ణులైన వారికీ అవకాశాలు కల్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్నాం. సర్టిఫికెట్ల ఆధారంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రతి నెలా జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నాం. ఈ జాబ్ మేళాకు రాష్ట్రంలోని పలు సంస్థలు నిపుణులైన వారిని ఉద్యోగాలకు ఎంచుకుంటున్నాయి.

– ఘంటా సుధాకర్, ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

వీవోఏ, ఆర్‌పీల ధర్నా

ఏలూరు (టూటౌన్): వెలుగు వీవోఏ, మెప్మా ఆర్‌పీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వెలుగు వీవోఏ యానిమేటర్స్ ఉద్యోగ సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి కోరారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 36 గంటల ధర్నా బుధవారం రెండో రోజూ కొనసాగింది. వీవోఏ, ఆర్‌పీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ వీవోఏ,ఆర్‌పీల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివిధ సంఘాల నాయకులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, ఎస్‌కే సుభాషిణి, ఎం.నాగమణి, ఎ.ఫ్రాన్సిస్, కె.లెనిన్ మాట్లాడారు. మేరీ, ఆదిలక్ష్మి, వి.సాయిబాబు, జె.గోపి, బి.జగన్నాథం నాయకత్వం వహించారు.

సాయిబాబాకు పూజలు

ఉంగుటూరు: స్థానిక సద్గురు నాగ షిర్డీ సాయినాథ పంచాయతన క్షేత్రంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కాగడ హారతి, గణపతిపూజ మొదలుకుని పుణ్యాహవచనం, గురుమండల అర్చన, 108 కళశాల పూజ, సీతారామ లక్ష్మణ ఆంజనేయ పంచలోహ విగ్రహాలకు సంప్రోక్షణ, గ్రామ ప్రదక్షణ, అష్టోత్తరం, అగ్నిప్రతిష్ఠాపన, హోమాలు, సాయంత్రం సంధ్యాహారతి, శేజ హారతి, ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు అక్కిన లక్ష్మీనారాయణ, స్వరాజ్యలక్ష్మి, నాగేంద్రబాబు, బాల నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉపా చట్టం, ఎన్ఐఏలను రద్దు చేయాలి



పాత బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు,కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది ప్రజాసంఘాల నాయకుల ఇళ్లపై ఎన్ఐఏ దాడులు చేసి ఉపా చట్టం కింద కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాని, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం జాన్ రాజు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ - షాల ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే వారిపై దాడి చేయడం సరి కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమైనప్పుడు ప్రశ్నించే హక్కును రాజ్యాంగం కల్పించిందని వివరించారు. గతంలో కూడా టాడా, పోడా, నాసా, మీసా లాంటి అనేక నిర్బంధ చట్టాలను ఉపయోగించినా ప్రజా ఉద్యమాలను నిలువరించలేకపోయారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకొని రాజ్యాంగ హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ నగర నాయకులు మంగం అప్పారావు, గడసాల రాంబాబు, పల్లి గంగరాజు, ఎం.త్రినాథ్, పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి



ప్రసాద్ మృతదేహం



మృతుడు కళ్ల నుంచి కారిన రక్తం

ఏలూరు టౌన్: ఏలూరు శ్రీరామ్‌నగర్ 3వ రోడ్డులోని ఒక ఇంట్లో ఒక వ్యక్తి అనుమానానస్పద స్థితిలో మృతిచెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గం నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి భర్త ప్రసాద్‌గా పోలీసులు నిర్ధారించారు. మృతదేహంపై గాయాలు ఉండడం, కళ్ల వెంట రక్తం కారుతూ ఉండడంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఐతే ఘంటసాల వెంకటలక్ష్మితో అతను చాలా కాలంగా దూరంగా ఉంటున్నట్లు చెబుతున్నారు. మృతుడు ప్రసాద్ కాకినాడ విభిన్న ప్రతిభావంతుల హాస్టల్ అధికారిగా పనిచేస్తున్నాడని, ఏలూరు శ్రీరామ్ నగర్‌లో ఒంటరిగా నివసిస్తున్నట్లు తెలుస్తోంది. మృతుడు ఊపిరాడక లేక మద్యం సేవించి పడిపోవటంతో చనిపోయాడా, లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చేతి మణికట్టు వద్ద, కాళ్లపైనా, వంటిపైనా గాయాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక



హాజరైన నగరపాలక సంస్థ అధికారులు



ఏలూరు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రజారోగ్య పరిరక్షణకు స్పష్టమైన ప్రణాళికతో పని చేస్తున్నామని, ప్రజలకు ఆరోగ్య భరోసాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు నగరపాలక సంస్థ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సురక్షలో ప్రతి ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వారికి వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టామని, ఏదైనా అత్యవసర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు రిఫర్ చేసి వైద్య చికిత్స అందించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతోన్న రోగులకు, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఏలూరు నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, అదనపు కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, తహసీల్దార్ సోమశేఖర్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్లు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆళ్ల నాని

18న ఉపాధి హామీ చట్టంపై సదస్సు



సదస్సు కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం - వేతనాలు, పనిదినాలు పెంచుకుందాం అనే అంశంపై ఏలూరులో ఈ నెల 18న నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఈమేరకు స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన సదస్సు కరపత్రం విడుదల చేశారు. 18న ఆర్ఆర్ పేటలోని కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథులుగా సీపీఎం ఆల్‌ఇండియా నాయకులు ఎంపీ శివదాసు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, వి.శివనాగరాణి తదితరులు పాల్గొంటారని తెలిపారు. కేంద్రం బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు ఇవ్వాలని కోరారు. రెండు పూటలా పని విధానాన్ని, యంత్రాలు, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేయాలని అన్నారు. సదస్సుకు వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రవి కోరారు.

14 నుంచి అవగాహన కార్యక్రమాలు

దెందులూరు: పోతునూరు, దెందులూరు గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 24 వరకు జాతీయ గ్రంథాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోతునూరు గ్రంథాలయ అధికారి రాంబాబు తెలిపారు. నిత్యం ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు వినడం, 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవడం, 10 నుంచి 10.10 వరకు విరామం, 10.10 నుంచి 10.30 వరకు పుస్తక సమీక్ష, 10.30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం, 11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్‌పై విద్యార్థులకు అవగాహన, శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	100
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-07
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	34	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	38-44	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	30	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	34	తోటకూర	12
గోరుచిక్కుడు	34	గోంగూర	06
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	36-46
		నిమ్మకాయలు (డజను)	--

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



పెదపాడు : వీరమ్మకుంటలో వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సుర క్ష శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఓపీ రిజిస్ట్రేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం మెరుగుపర్చేందుకు జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారని పద్మశ్రీ చెప్పారు. మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి.విజయకుమార్ రాజ్, వైద్యులు పాల్, చక్రధర్, ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ మరడాని చంటి, ఎంపీటీసీ పూడి అప్పలస్వామి, గుణుపూరు మహేష్, పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలల తనిఖీ

ఉంగుటూరు: స్థానిక ఎంపీపీ పాఠశాలలను జిల్లా విజిలెన్స్ కమిటీ కోనే వీర వెంకట సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. రికార్డులు, స్టాక్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు రుచిగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. వంట చేసే ప్రదేశాలు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

సర్పంచ్ కొడుకుపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ లీలానవకాంతం

దెందులూరు: జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతంను వివక్షతతో దూషణలు చేస్తున్న మండలంలోని జోగన్నపాలెం గ్రామ సర్పంచ్ కుమారుడు మధుపై చర్యలు తీసుకోవా లని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎస్సీ సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. బుధవారం జోగన్నపాలెంలో దళిత జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పోతునూరు, గాలాయ గూడెం, గోపన్నపాలెం సర్పంచులు బోదు ల స్వరూప్, చిలకా వెంకట సుబ్బారావు, కోటే నాగమల్లేశ్వరి కుమార్, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావులు మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో సర్పంచ్ కుమారుడు మధు జెడ్పీటీసీని దూషించడం, దౌర్జన్యం చేయడం, అధికారులను బెదిరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎన్నికల నాటి నుంచీ గ్రామ సర్పంచ్ రాకపోయినా, ఆమె కుమారుడు మధు సర్పంచ్‌లా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తున్నారని, ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని ఆరోపించారు. రెండేళ్లుగా మధు గ్రామ పంచాయతీల అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారని, కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధుపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, జోగన్నపాలెం గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నిట్టా గాంధీ ఉన్నారు.